క్లుప్తంగా

నిడమర్రు ఎస్సైగా రమేష్


ఎస్సై రమేష్

నిడమర్రు: నిడమర్రు ఎస్సైగా ఎస్ఎన్‌వీవీ రమేష్ మంగళవారం నిడమర్రు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎస్సైగా ఉన్న వీర ప్రసాద్ ఏలూరు స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. నూతనంగా వచ్చిన ఎస్సై రమేష్ రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చారు. ఈయన ఉమ్మడి జిల్లాలో తాడేపల్లిగుడెం, పెనుమంట్ర, పెనుగొండ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణతో పాటు, మండలంలో పేకాట, కోడి పందేల నిర్వహణపై ప్రత్యేక నిఘాతో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


రైతులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నిడమర్రు: రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బువ్వనపల్లి గ్రామంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల నుంచి ఆక్వా రంగాన్ని కాపాడలన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో 60 శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. చిరిగిన గోనె సంచులు రైతులకు ఇవ్వడం దారుణమన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సందీప్


ఎంపికైన సందీప్

గణపవరం: మండలంలోని పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అల్లాడి సందీప్ అండర్–17 కేటగిరీలో రాష్ట్ర స్థాయి హేండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పి.జయ వెంకటేశ్వర్లు తెలిపారు. సందీప్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. సందీప్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అద్దేపల్లి ప్రసాద్, సందీప్‌ను మంగళవారం హెచ్ఎం, విద్యా కమిటీ చైర్మన్ బాలాజీ, పాఠశాల సిబ్బంది తదితరులు అభినందించారు.

బాదంపూడి దత్త క్షేత్రంలో హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాల సుబ్రహమణ్య స్వామి ఆలయంలో మంగళవారం పూర్ణిమ హోమం నిర్వహించారు. అశ్వయుజ పూర్ణిమ సందర్భంగా ఈ హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కలవచర్ల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని పూజలునిర్వహించారు.

విజేతలకు బహుమతులు


బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: దసరా మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలు విభాగాల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. విజేతలను మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, కేబుల్ శ్రీను, ప్రభాకర్‌రావు తదితరులు అభినందించారు.

ఫ్యాప్టో ధర్నాకు తరలి వెళ్లిన ఉపాధ్యాయులు


ధర్నాకు తరలి వెళుతున్న ఉపాధ్యాయులు

గణపవరం: కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ఆందోళనకు గణపవరం, నిడమర్రు మండలాల నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, పెంటపాడు, తాడేపల్లిగూడెం ప్రాంతాల ఉపాధ్యాయులంతా ప్రత్యేక బస్సులలో విజయవాడ తరలి వెళ్లారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆయా సంఘాల సభ్యులు విజయవాడ ఆందోళన కార్యక్రమానికి తరలి వెళ్లారు.

మొదలైన స్థానిక ఎన్నికల హడావిడి

గ్రామాల్లో ఆశావహుల ఎదురుచూపు



ఉంగుటూరు: పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి పూర్తయ్యే సమయం దగ్గర పడుతుంది. దీంతో తిరిగి పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ముందడుగు వేసింది. ఎన్నికల సంఘం ప్రభుత్వ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమవుతుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 2021 ఫిబ్రవరి 21న నాలుగో విడతలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాలకు 2026 ఏప్రిల్‌తో సమయం ముగియనుంది. తాజాగా ఎన్నికల సంఘం ఆదేశాలతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించొచ్చని అంచనా వేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈ నెల 15 లోపు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. 16 నుంచి నవంబర్ 16 లోపు వార్డుల వారీ జాబితా సిద్ధం చేసి ప్రకటించాల్సి ఉంది. నవంబర్ 1 నుంచి 15 లోపు ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాల్సి ఉంది. నవంబర్ 15 నుంచి 30 మధ్య పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలు సిద్ధం చేయడం, సేకరణ, తదితర పనులు పూర్తి చేయాలి. డిసెంబరు 15వ తేదీకి రిజర్వేషన్లు ఖరారు చేయాలి. డిసెంబర్ చివరి వారంలో అఖిలపక్ష నాయకులతో సమావేశాలు నిర్వహించి 2026 జనవరిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వెను వెంటనే ఫలితాలు వెల్లడిస్తారు.

నియోజకవర్గంలో 81 పంచాయతీలు

ఉంగుటూరు నియోజకవర్గంలో 81 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో 16 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. రిజర్వేషన్లు అనుసరించి గతంలో 42 పంచాయతీలు మహిళలకు దక్కాయి. ఉంగుటూరు మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా 278 వార్డులు ఉన్నాయి. గణపవరం మండలంలో 25 పంచాయతీలు ఉండగా 248 వార్డులు ఉన్నాయి. నిడమర్రు మండలంలో 16 పంచాయతీలు ఉండగా 168 వార్డులు ఉన్నాయి. భీమడోలు మండంలో 13 పంచాయతీలకుగాను 150 వార్డులు ఉన్నాయి.

వీడని వర్షం.. తప్పని తిప్పలు

ఉంగుటూరు: మండలంలో ఎడతెరిపి లేకుండా రోజు విడిచి రోజు వర్షం పడుతూనే ఉంది. ఈదరుగాలులు ఓ వైపు అంతలోనే ఎండలు, ఇంతలోనే వర్షం ఇలా వాతావరణ సమతుల్యం లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. కురుస్తున వర్షాలు, కాస్తున్న ఎండలు వ్యవసాయానికి ఎంత మాత్రం లాభదాయకం కాదని రైతులు చెబుతున్నారు. దీంతో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. 20.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో వర్షాలు కురవడంతో రైతులు కొన్ని రకాల పంటలను కోల్పోయిన విషయం తెల్సిందే. ఇంకా వర్షాలు వీడకుండా కురుస్తుండటంతో రైతులకు ఉపయోగం లేదని వాపోతున్నారు. రహదారులు ఛిద్రమవుతున్నాయి. అంతేగాక మురుగు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజారోగ్యంలో ఆరోగ్య సిబ్బంది పాత్ర కీలకం


మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

భీమడోలు: అంటు వ్యాధులను అరికట్టడంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్ల పాత్ర కీలకమని ఏలూరు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ వద్ద ఆశాడేను పురస్కరించుకుని మంగళవారం కీటకాల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వాటి నివారణ చర్యలు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్ర నీటి నిల్వల వలన డెంగీ దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ప్రతి శుక్రవారం పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఇందిరాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ మధుబాబు,, సిబ్బంది మేకా శ్రీనివాసరావు, చందుకుమార్, ఆరోగ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అంటువ్యాధులు అరికట్టాలి

దెందులూరు: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలోనూ జ్వరాలు అరికట్టడంలోనూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల సేవలు కీలకమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. దెందులూరు మండలం పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా డెంగీ జ్వరాలు ప్రబలడానికి ఎక్కువ రోజులు మంచినీటి నిలువ ప్రాంతాలు పరిశుభ్ర పరచుకోకపోవడమేనని తెలిపారు. వారానికి ఒకసారి ఫ్రైడే ఆచరించాలని ముఖ్యంగా దోమలు నిర్మూలించాలంటే దోమ లార్వాలను ఎలిమినేషన్ చేయవలసిన ఆవశ్యకత ఉందని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపరూ..


చేబ్రోలు రైల్వే స్టేషన్ ఇదే

ఉంగుటూరు: చేబ్రోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో నాలుగు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. పాస్ ప్యాసింజర్ తప్ప మరే రైలు ఆగడం లేదు. అది కూడా అనుకూలత లేని సమయం. గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లు ఒకప్పుడు రద్దీగా ఉండేవి. బ్రిటిష్ కాలం నుంచి ఉంగుటూరు, బాదంపూడి, కైకరం, చేబ్రోలు స్టేషన్లు ఎంతో బిబీగా ఉండేవి. అలాంటి స్టేషన్లు మూసి వేసింది రైల్వే శాఖ. అలంకారప్రాయంగా మాత్రమే దర్శనమిస్తున్నాయి. రైల్వే శాఖకు గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లే ఆదాయం అందించాయి. అలాంటిది ఈ స్టేషన్లలో రైళ్లు ఆగక వెలవెలబోతున్నాయి. చేబ్రోలులో అప్, డౌన్ లైన్‌లో వెళ్లే పాస్ట్ ప్యాసింజర్ ఒకటే ఆగుతుంది. పైన పేర్కొన్న స్టేషన్లు ఎటూ మూసి వేశారు. కనీసం చేబ్రోలు స్టేషన్‌లోనైనా ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు. 70 వేల మందికి పైగా ఉన్న ప్రజలకు ప్రయాణ సౌకర్యం లేక 20 కిలో మీటర్ల దూరం ఉన్న తాడేపల్లిగూడెం, 55 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏలూరు రోడ్డు మార్గంలో చేరుకుని రైలు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం రెండు ఎక్స్‌ప్రెస్‌లు అయినా చేబ్రోలులో ఆపించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ఎంపీలకు విజ్ఞప్తులు చేశారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించాలని కోరారు.

జీఎస్టీ అవగాహన సదస్సులో అపశృతి


చికిత్స పొందుతున్న విద్యార్థి కార్తీక్

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జీఎస్టీ అవగాహన సదస్సులో అపశృతి చోటు చేసుకుంది. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల కథనం ప్రకారం జీఎస్టీ అవగాహన సమావేశానికి ఏడో తరగతి విద్యార్థి కార్తీక్ మైక్ తీసుకుని వస్తుండగా షాక్ కొట్టింది. షాక్‌తో ఊగిపోతున్న విద్యార్థిని చూసి పాఠశాల పీడీ సుల్తానా వెంటనే విద్యార్థి దగ్గరికి వచ్చి పట్టుకోవడంతో ఆమెకూ షాక్ కొట్టింది. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని గోపన్నపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. కార్తీక్‌ను ఏలూరు జిల్లా డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీవైఈవో రవీంద్రభారతి, దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ పరామర్శించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి, వైద్యులను కార్తీక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ఆందోళన బాటలో ఆశా కార్యకర్తలు


ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

భీమడోలు: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుండుగొలను పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నామని, పెరుగుతున్న పని భారంతో ప్రభుత్వం అందించే అరకొర వేతనంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చారన్నారు. గద్దె నెక్కి 17 నెలలు కావస్తున్నా నేటికీ హామీల ఊసు ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలని, ఆశాలను పర్మినెంట్ చేయాలని, జనాభాకు అనుగుణంగా ఆశావర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు వైద్యురాలికి అందజేశారు. కార్యక్రమంలో ఆశా యూనియన్, సీఐటీయు నాయకులు పద్మ, నాగజ్యోతి, నయోమి, బేబి పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతాం


గొల్ల కిరణ్

దెందులూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడిని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గొల్ల కిరణ్ ఖండించారు. మంగళవారం కొవ్వలి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని సాక్షాత్తు న్యాయవాది తూట్లు పొడిచారని భారత దేశ ప్రధాన న్యాయమూర్తిని అవమానించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు చేస్తామన్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో నిరసనలు ప్రారంభించమన్నారు. విధి నిర్వహణలో ఉన్న సామాన్య ఉద్యోగిపై దాడి దౌర్జన్యం చేస్తే అరెస్టు చేసి జైల్లో పెడుతున్న ప్రస్తుత చట్టం సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దౌర్జన్యం అవమానం దాడి చేస్తే కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. అన్ని సంఘాలను సమన్వయం చేసుకొని నిరసనలు మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర కార్యదర్శి కిరణ్ అన్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

గణపవరం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాఠశాలల్లో నిర్వహించిన జీఎస్టీ అవగాహన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.

తూము పూడ్చి వేశారని కేసు నమోదు

పెదపాడు: తమ చెరువు మురుగు తూములో చెత్త, కర్రలు వేసి పూడ్చినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామానికి చెందిన యలమంచిలి భువనేశ్వరీదేవికి చెందిన చేపల చెరువుకు ఉన్న మురుగు బోదె తూముకు ఇనుపచట్రం వేసి తాళం వేశానని, తాళం పగులకొట్టి సత్యవోలు గ్రామానికి తాటి రంగారావు తూములో చెత్త, కర్రలు వేసి పూడ్చి వేసినట్లు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పెదపాడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం


108 చీరల అలంకరణలో నూకాలమ్మ


ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. శరత్కాల పూర్ణిమ పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో చండీహోమం నిర్వహించి, మహా పూర్ణాహుతి సభక్తి పూర్వకంగా నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ 15 రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు పూర్ణాహుతితో సంపూర్ణమయ్యాయన్నారు. ఆలయకమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) సారథ్యంలో చైర్మన్ రొంగల నాగేశ్వరావుతో కూడిన ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబికా సేవా బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. అలాగే అమ్మవారికి అష్టోత్తర శతనామార్చనతో నామానికి ఒక చీర చొప్పున 108 చీరలతో చేసిన విశేష అలంకరణ భక్తుల దర్శనార్థం ఈ నెల 10వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తిప్పభట్ల రామకృష్ణ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లూరి రామకృష్ణ, పోలుపర్తి రాము, గాలి నూకరాజు, చిట్లూరి సర్వేశ్వరరావు, నౌడు సత్య నూకరాజు, జీవీకేఎస్ రాజు, చొప్పెర్ల లక్ష్మీనారాయణ, చింతకాయల అచ్చిరాజు, బేకరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


గోలి చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శిగా నియమితులైన గోలి చంద్రశేఖర్ రెడ్డిని చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, కె.చండీప్రియ, తుమ్మూరి వెంకటరామిరెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఆతుకూరి సుబ్బారావు, పి.మాధవరెడ్డి, ఎం.ఇమ్మానుయేలు, ఎస్.కాంతారావు, గోలి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయ విత్తనాల పంపిణీ


కూరగాయ విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

పోలవరం రూరల్: అరటి తోటలో కూరగాయ విత్తనాలు పండించి అభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇ.రేఖ తెలిపారు. పోలవరం మండలం కొండ్రుకోట పునరవాస కేంద్రంలో కుటుంబాలకు కృషి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో స్థానిక ఐటీడీఎస్ సంస్థ సహకారంతో 10 రకాల కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాలను న్యూఢిల్లీ నుంచి రప్పించారు. పెరటిలో కూరగాయలను పండించి సొంతంగా వాడుకుంటూ ఇతరులకు విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో నాటు కోళ్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త బి.పెదబాబు మాట్లాడుతూ సాయిల్ టెస్టింగ్ చేశామన్నారు. వాటికి వాడే మందులు పిచికారీ చేసే విధానం తెలిపారు. శాస్త్రవేత్త ఎ.దేవీ వరప్రసాద్ రెడ్డి, ఐటీడీఎస్ సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ గ్రామాలను దత్తత తీసుకుని నిర్వాసితులకు ఆర్థికంగా ఏ విధంగా ఎదగాలనే విషయాలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గంగు రామలక్ష్మి, మిడియం కన్నపరాజు దొర, సున్నం రాజేష్, మేదె పెదముక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు బయ్యన్నగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.రవికుమార్ మంగళవారం పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్లలో భాగంగా సెలక్టర్లు వీరిని ఎంపిక చేశారు అన్నారు. హ్యాండ్ బాల్ అండర్–14 విభాగంలో ఎస్.సత్యవరలక్ష్మి, జి.లోకేష్, టి.శివనాగశ్రీనివాస్. రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారన్నారు. గతంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో వీరు కనపరిచిన ప్రతిభను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

కే.కోట విద్యార్థులు..

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్యామలాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ అండర్–14, అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

యడవల్లి విద్యార్థులు..

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.రవి తెలిపారు. సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన ఎం.హేమంత్, జి.వెంకటేశ్వరరావు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికై నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం పురష్కరించుకుని అన్నదానం నిర్వహించారు. 300 మందికి నిర్వహించిన ఈ అన్నదానానికి కాళ్ల మల్లిఖార్జునరావు కుటుంబసభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆలయ ఈఓ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటిని అందించాలి


వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాసరావు

దెందులూరు: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని సీతంపేట కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎలమర్తి శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షిత తాగునీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. స్థానికులు తాగునీటి రుచిలో తేడా ఉన్నట్టు ఆయన దృష్టికి తీసుకురావడంతో తాగునీటి పథకంతో పాటు ఫిల్టర్ బెడ్‌లను సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు పరిశీలించారు.

విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన

పెదపాడు: విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్సిల్, పెన్నులపై జీఎస్టీ ఎత్తి వేయడం సంతోషదాయకమని జీఎస్టీ డిప్యూటీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు.